సాక్షి
వికారాబాద్
మంగళవారం । 2 । మే । 2023



రెండు కార్ల ఢీ

ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొనడంతో మహిళ మృతి చెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. 8లో▸



భరోసా ఇవ్వని 'ఉపాధి'

గ్రామాల అభివృద్ధిలో కీలకంగా మారిన ఉపాధి హామీ పథకం, ఉద్యోగుల సేవలకు మాత్రం గుర్తింపు లేకుండా పోయింది. 8లో▸



శ్రమ దోపిడీని అరికట్టాలి

కష్టజీవుల శ్రమ దోపిడీని అరికట్టాలని, పనికి తగ్గ వేతనం చెల్లించాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. 9లో▸

న్యూస్‌రీల్

ట్రిబుల్ ధమాకా

ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చిన తల్లి



ముగ్గురు బిడ్డలతో తల్లి మమత

పెద్దేముల్: వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం నాగులపల్లికి చెందిన కే మమత రెండో కాన్పులో ముగ్గురు మగ బిడ్డలకు జన్మని చ్చింది.నెలలు నిండడంతో కుటుంబ సభ్యులు ఆమెను రెండు రోజుల క్రితం తాండూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ఆమెను పరీక్షించి కాన్పు కష్టమని తేల్చారు. హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు మమతను తాండూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ముగ్గురు మగ బిడ్డలకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహానికి రండి..



సీఎం కేసీఆర్‌కు శుభలేఖ అందజేస్తున్న పట్నం దంపతులు

అనంతగిరి: ఎమ్మెల్సీ డాక్టర్ మహేందర్‌రెడ్డి – జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతుల కూతురు మనీషారెడ్డి వివాహం ఈ నెల 14న శంషాబాద్‌లో జరగనుంది. ఈ వేడుకకు హాజరుకావాలని సోమవారం వారు సీఎం కేసీఆర్‌ను కలసి శుభలేఖను అందజేశారు. వారి వెంట కుమారుడు రినీష్‌రెడ్డి ఉన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం

అదనపు కలెక్టర్ తిరుపతిరావు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని అదనపు కలెక్టర్ తిరుపతిరావు జిల్లా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు.ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు బదిలీ చేయాలని అధికారులకు సూచించారు. అధిక ప్రాధాన్యత కలిగిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల కేటాయింపు నేడు

సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు చెందిన నాగోల్ బండ్లగూడ, పోచారంలలో మిగిలిపోయిన ఫ్లాట్లను మంగళవారం కేటాయించనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. గత నెల 15 నాటికి టోకెన్ అడ్వాన్స్ చెల్లించిన వారి పేర్లతో పారదర్శకంగా లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు వారు చెప్పారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి లాటరీ ప్రక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

5, 6 తేదీల్లో ఇంజినీరింగ్ సింపోజియాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 5, 6 తేదీలలో వివిధ విభాగాలలో జాతీయ సింపోజియాలు ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే సింపోజియాలలో సదస్సులు, పేపర్ ప్రజెంటేషన్స్, ఎగ్జిబిషన్స్, రోబోటిక్‌తో పాటు వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సింపోజియాలకు దేశ వ్యాప్తంగా ఐఐటీలు, ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్‌లో నిర్మాణ్–2023, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఇన్ఫినిటీ–2023, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో టెక్నోనెస్–2023, మెకానికల్ ఇంజినీరింగ్‌లో మెకరినా–2023, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఆకృతి–2023, బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో మెడిటెక్–2023, మైనింగ్ ఇంజినీరింగ్‌లో ఇగ్నైట్–2023 పేరుతో ఆయా విభాగాలలో వేర్వేరుగా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

మళ్లీ కదలిక



- పాలమూరు ఎత్తిపోతల పథకంపై పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు, మంత్రులతో సీఎం భేటీ
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు సాగునీరందించే అంశంపై చర్చ
- రూ. 5,180 కోట్లతో పనులు
- త్వరలో కాలువల తవ్వకాలకు టెండర్లు
- జిల్లాలో 3.41లక్షల ఎకరాలకు సాగునీరు

వికారాబాద్: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మళ్లీ కదలిక వచ్చింది. ఈ ప్రాజెక్టుపై సీఎం కేసీఆర్ పరీవాహక ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలతో సోమవారం నగరంలోని ఆయన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. దీంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మహబూబ్‌నగర్ సమీపంలో 16 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఉద్దండాపూర్ రిజర్వాయర్ పనులు తుది దశకు చేరుకోగా.. ఈ నెలాఖరుకు గానీ, వచ్చే నెలలో గానీ ఆ ప్రాజెక్టును కృష్ణా జలాలతో నింపే యోచనలో ప్రభుత్వం ఉంది. అయితే వికారాబాద్ జిల్లాకు అక్కడి నుంచి కాలువల ద్వారా సాగు నీరు అందించేలా ఇంజనీర్లు గతంలోనే ప్లాన్ తయారు చేశారు. ఉద్దండాపూర్ నుంచి జిల్లాలో కాలువలు నిర్మించేందుకు రూ. 5,180 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందుకు సంబంధించి వారం, పది రోజుల్లో టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించినట్లు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తెలిపారు. అయితే ఈ సారి అయినా ప్రాజెక్టును చిత్తశుద్ధితో పూర్తి చేసి జిల్లా రైతాంగానికి సాగు నీరు అందిస్తారా ? లేక ఎప్పటిలాగే ఎన్నికల సమయంలో హడావుడి చేసి చేతులు దులుపుకుంటారా..? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలో 3.41 లక్షల ఎకరాలకు సాగునీరు

జిల్లాలో 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీలు 408 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. పాలమూరు ఎత్తిపోతల పథకం ఫేజ్ – 2లో భాగంగా 417 గ్రామాల్లోని 3,41,952 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా కాల్వల నిర్మాణం కోసం 3,979 హెక్టార్ల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ప్రధా న కాల్వల కోసం 1,873 హెక్టార్లు, బ్రాంచ్ కెనాల్స్ కోసం 2,100 హెక్టార్ల భూమి అవసరం కానుంది. భూ సేకరణ జరిపితే 3,670 మంది రైతులు తమ పొలాలను కోల్పోనున్నారు. కాల్వల తవ్వకానికి రూ.5,180కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. త్వరలో టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

ప్రాజెక్టు పూర్వాపరాలు

ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు సాగు నీరు అందించేందుకు ఇప్పటి వరకు అనేక సార్లు డిజైన్లు మారుస్తూ వచ్చారు. ముందుగా జిల్లా పరిధిలో రిజర్వాయర్ నిర్మించాలని భావించిన ప్రభుత్వం తరువాత కేవలం కాలువల ద్వారా నీరు అందించేలా రీడిజైన్ చేసింది. ఈ ప్రాజెక్టును సాగు, తాగు నీటితో పాటు పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మూడు దశల్లో నిర్మిస్తున్నారు. రూ. 52,056 కోట్ల అంచనా వ్యయంతో ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా రూపకల్పన చేశారు. వరదలు వచ్చి నీటి లభ్యత ఉన్న సమయంలో రోజుకు రెండు టీఎంసీల చొప్పున రెండు నెలల వ్యవధిలో 60 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపనున్నారు. మొత్తం 18 ప్యాకేజీల ద్వారా ఐదు లిఫ్టుల సాయంతో ఆరు పెద్ద రిజర్వాయర్లు నింపి నీరందించనున్నారు. దీంతో వికారాబాద్ జిల్లాలో కాలువల సాయంతో 3.41 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

చిత్తశుద్ధి ఉంది



బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటోంది. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి జిల్లాకు నీరు అందించేందుకు సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో ఉన్నారు. జిల్లాలో కాలువల నిర్మాణం కోసం త్వరలో టెండర్లు పిలుస్తాం. పరిగి నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రాజెక్టు విషయమై సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు.

– కొప్పుల మహేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పరిగి

'ప్రజావాణి'కి 53 ఫిర్యాదులు



హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ శర్మ

- ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 53 ఫిర్యాదు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిష్కారం కాని సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత ఫిర్యాదు దారుడికి కారణాలు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్ఓ అశోక్‌కుమార్, జెడ్పీ సీఈఓ జానకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్ ప్రారంభం

పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో మే డే సందర్భంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు సాగే హెల్త్ క్యాంపును కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి 50 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డుతో చికిత్స పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు క్యాంపు ఇన్‌చార్జ్ సెల్ నంబర్ 6301877352లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కలెక్టరేట్‌లో సోమవారం యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని ప్రసంగించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వేసవి శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో యువజన క్రీడల జిల్లా అధికారి హన్మంత్ రావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్ శాఖలో 1వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థిని, విద్యార్థులు ఈ నెల 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు రెండు సీట్లు కేటాయించారని తెలిపారు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1.50లక్షలు, పట్టణ ప్రాంతం వారి వార్షిక ఆదాయం రూ. 2లక్షలు మించరాదని తెలిపారు. దరఖాస్తు ఫారాలను కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కార్యాలయంలో పొందాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9573859268లో సంప్రదించాలని సూచించారు.

చదువు సాగేదెలా..?



- జిల్లాలో 563 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- మూడేళ్లుగా భర్తీ కాని వీవీ పోస్టులు
- విద్యా ప్రమాణాలపై ప్రభావం
- ఆందోళనలో తల్లిదండ్రులు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలను ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల బాగుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో మాత్రం తాత్సారం చేస్తోందనే విమర్శలు ఉన్నాయి. గత ఏడాది విద్యా వలంటీర్లను కూడా నియమించలేదు. దీంతో బోధనా సిబ్బంది లేక విద్యార్థులకు నష్టం జరిగిందనే అపవాదు ఉంది. జిల్లాలో పలు చోట్ల ఎంఈఓలు లేక పాఠశాలల పర్యవేక్షణ కొరవడింది.

గడిచిన ఏడాది అంతంతే..

కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు తీవ్రంగా దెబ్బ తిన్న విద్యా వ్యవస్థ ఇంకా గాడిన పడలేదు. అప్పట్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతుల వల్ల విద్యార్థులు చదువులో పూర్తిగా వెనుకబడి పోయారు. వరుస సెలవుల కారణంగా రెండేళ్ల పాటు పిల్లలు ఇళ్లకే పరిమితమైన విషయం తెలిసిందే. గత ఏడాది పూర్తిస్థాయిలో పాఠశాలలు పునః ప్రారంభమైనా విద్యార్థులు ఆశించిన మేర చదువులో రాణించలేదనేది వాస్తవం. ఖాళీలు భర్తీ కాకపోవడంతో ఉన్న ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

563 పోస్టులు ఖాళీ

జిల్లాలో జెడ్పీహెచ్‌ఎస్, యూపీఎస్, పీఎస్ కలిపి 1,054 ఉన్నాయి. వీటిలో 91,898 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీలు కలిపి 3,618 మంది ఉపాధ్యాయులు పని చేయాలి. అయితే 3,055 మందే విధులు నిర్వహిస్తున్నారు. 563 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

తెలుగు మీడియంలో ఖాళీలు	
లాంగ్వేజ్ పండిత్ తెలుగు	09
లాంగ్వేజ్ పండిత్ హిందీ	10
ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం	64
పీఈటీ	05
ఎస్‌ఏ బయో సైన్స్	61
ఎస్‌ఏ ఇంగ్లిష్	56
ఎస్‌ఏ హిందీ	07
ఎస్‌ఏ మ్యాథ్స్	20
ఎస్‌ఏ పీడీ	07
ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్	10
ఎస్‌ఏ సోషల్	70
ఎస్‌ఏ తెలుగు	17
ఎస్జీటీ	170
ఉర్దూ మీడియంలో..	
లాంగ్వేజ్ ఉర్దూ	03
బయో సైన్స్	01
ఎస్‌ఏ మ్యాథ్స్	06
ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్	04
ఎస్‌ఏ సోషల్	05
ఎస్‌ఏ ఉర్దూ	04
ఎస్జీటీ	34

2019 వరకు 122 మంది విద్యా వలంటీర్లతో నెట్టుకొచ్చారు. వారి గడువు ముగియడం, తిరిగి విధుల్లోకి తీసుకోకపోవడంతో ఉన్న ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరగాలంటే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. చాలా కాలంగా పోస్టులు భర్తీ చేయక పోవడంతో ఉన్న ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది. వీవీలను కూడా నియమించడం లేదు. ఇలా అయితే విద్యా ప్రమాణాలు పడిపోయే ప్రమాదం ఉంది. ఉపాధ్యాయుల సర్దుబాటుతో సమస్య పరిష్కారం కాదు. పదోన్నతులు ఇచ్చి వెంటనే కొత్త పోస్టులు భర్తీ చేయాలి. లేకుంటే విద్యా ప్రమాణాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

– చంద్రశేఖర్, పీఆర్టీయూ, జిల్లా అధ్యక్షుడు

జుంటి వాగుకు జలకళ



అలుగు పారుతున్న జుంటి వాగు

బషీరాబాద్: మండు వేసవిలో అకాల వర్షాలు పడడంతో మండలంలోని జుంటి వాగు మత్తడి దూకుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. దీంతో చెక్ డ్యాం అలుగు పారుతోంది. మండలంలోని చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతోంది. పలు గ్రామాల్లో లోతట్టు కాలనీలు నీట మునిగి ప్రజలు అవస్థలు పడ్డారు. ఇదిలా ఉండగా వేసవి తాపం నుంచి జనం ఉపశమనం పొందుతున్నారు.

జిల్లాలో 12.7 ఎంఎం సగటు వర్షపాతం

తాండూరు: జిల్లాలో అకాల వర్షాలు పంటలకు నష్టం చేకూర్చాయి. ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. బొంరాస్‌పేట్ మండలంలో 38 ఎంఎంలు, కొడంగల్ మండలంలో 29.3 ఎంఎంలు, బషీరాబాద్ మండలంలో 30 ఎంఎంలు, వికారాబాద్ మండలంలో 22ఎంఎంలతో పాటు మిగతా మండలాల్లో ఓ మోస్తారు వర్షపాతం నమోదైంది. జిల్లాలో కురిసిన వర్షానికి పలు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట చేతికి అందే సమయంలో వర్షాలు పడడంతో రైతులు నష్టపోయారు.

వినూత్నం.. 'వేసవి పఠనం'

వేసవి సెలవులు వచ్చాయంటే పిల్లలను భరించడం తల్లిదండ్రులకు ఓ సవాలే.. వారిని కట్టడి చేయడానికి నానా తంటాలు పడుతుంటారు. దాదాపు రెండు నెలల పాటు పుస్తకాల మాటే ఎత్తరు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను చదువుపై దృష్టి మళ్లించడానికి విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వేసవి పఠనా శిబిరాల ద్వారా చదువుపై ఆసక్తి పెంచడానికి రంగం సిద్ధం చేసింది.


- సర్కారు స్కూళ్లలో వేసవి పఠనా శిబిరాలు
- విజ్ఞానం, వినోదంతో కూడిన బోధన
- ప్రతి ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు
- కరోనా సమయంలో శ్రీకారం
- సత్ఫలితాలతో జిల్లా వ్యాప్తంగా అమలుకు సన్నాహాలు
- అప్పాయిపల్లిలో శిబిరాన్ని ప్రారంభించిన డీఈఓ రేణుకాదేవి



అప్పాయిపల్లిలో వేసవి పఠన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ రేణుకాదేవి

కొడంగల్ రూరల్: విద్యార్థుల్లో చదువుపై పట్టుదల, ఆసక్తి పెంచడం.. లక్ష్యం వైపు వెళ్లేందుకు పఠనా శిబిరాలు ఎంతగానో తోడ్పడతాయి. పాఠశాల సాధారణ బోధనకు భిన్నంగా ఈ శిబిరాలు కొనసాగుతాయి. కథలు చదవడం, వినడం, రాయడం వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తారు. తద్వారా విద్యార్థులను ఓ గమ్యం వైపు అడుగులు వేయిస్తారు.. ఈ తరహా బోధనకు మూడేళ్ల క్రితం కొడంగల్ మండలం అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. కరోనా సమయంలో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో పఠనా శిబిరాలను ప్రారంభించారు. తదనంతరం వీటిని వేసవి శిబిరాలుగా మార్చారు. ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని జిల్లాలో ప్రత్యేక శిబిరాలను ప్రారంభిస్తున్నారు. సోమవారం డీఈవో రేణుకాదేవి అప్పాయిపల్లిలో వేసవి పఠన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో మూడేళ్ల క్రితం మొదటి సారిగా కరోనా సమయంలో పఠన శిబిరం ప్రారంభించమని తెలిపారు. మంచి ఫలితం రావడంతో జిల్లా వ్యాప్తంగా అమలుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అప్పాయిపల్లిలో పిల్లలకు పాఠాలు చెప్పేందుకు 8మంది వలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని పేర్కొన్నారు. మండలంలోని చిన్ననందిగామ, బూల్కాపూర్ గ్రామా ల్లో వేసవి పఠన శిబిరాలను ప్రారంభించారని తెలిపారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సబ్జెక్టుపై అవగాహన కల్పించేందుకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. వలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంటపాటు విద్యార్థులకు బోధన చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ రవికుమార్, ఎంఈఓ కే రాం రెడ్డి, హెచ్‌ఎం విష్ణు, ఉపాధ్యాయులు వెంకటయ్య, వీరేశం, సర్పంచ్ గీతా ఠాకూర్, వలంటీర్లు పృథ్వీ సింగ్, నాగప్ప, స్వప్న, శ్వేత, భవాని, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


పఠనాసక్తి పెరుగుతుంది



విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచడానికి వేసవి పఠన శిబిరాలు ఉపయోగపడతాయి. సెలవుల్లో పిల్లలు చదువుకు దూరం కాకూడదనే శిబిరాలు నిర్వహిస్తున్నాం. పాఠశాల బోధనకు భిన్నంగా చదువు సాగుతుంది. ప్రతి ఆదివారం వినూత్న కార్యక్రమాలు ఉంటాయి. విద్యార్థులను లక్ష్యం వైపు నడిపించడానికి ఈ శిబిరాలు తోడ్పడతాయి.

– వీరేశం, ఉపాధ్యాయుడు, అప్పాయిపల్లి

సద్వినియోగం చేసుకోవాలి



విజ్ఞానం తోపాటు వినోదంతో కూడిన బోధన చేయాలన్నదే పఠన శిబిరాల ముఖ్య ఉద్దేశం. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ఉదయం పూట నిర్వహించే శిబిరాలకు తల్లిదండ్రులు వారి పిల్లలను పంపి ప్రోత్సహించాలి. గతంలో ఇళ్లలో వృద్ధులు పిల్లలకు కథలు చెప్పేవారు. అదే తరహాలో చదువు సాగుతుంది. వలంటీర్లు కూడా వేసవి పఠన శిబిరాల్లో భాగస్వాములు కావాలి.

– రాంరెడ్డి, ఎంఈఓ, కొడంగల్

క్లుప్తంగా

విగ్రహావిష్కరణకు మంత్రి రాక

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లిలో మంగళవారం నిర్వహించనున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విచ్చేయనున్నట్లు గౌడ సంఘం నేతలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గౌడ కులస్తులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన ఆకతాయిలు

పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్

తాండూరు రూరల్: అంతారం గ్రామం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కొందరు ఆకతాయిలు ధ్వంసం చేశారు. ఈ విషయమై సర్పంచ్ రాములు సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కొందరు యువకులను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. సీసీ పుటేజీలను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

మల్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో..

మల్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల తలుపులు, కిటికీలు ధ్వంసం చేశారు. ఈ విషయమై హెచ్ఎం వైద్యనాథ్ సోమవారం కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా..

13 మందికి గాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆమనగల్లు: కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండల పరిధిలోని మాలెపల్లి శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన 15 మంది కూలీలు ఆటోలో సింగపల్లి గ్రామానికి కూలికి వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో మాలెపల్లి గ్రామశివారులో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో లక్ష్మి, అలివేలు, ప్రసన్న, పద్మ, చైతన్య, మౌనిక, పద్మమ్మ, అలివేలు, చంద్రమ్మ, పార్వతమ్మ, పద్మమ్మ, వెంకటమ్మ, పద్మ గాయపడ్డారు. దీంతో గమనించిన గ్రామస్తులను క్షతగాత్రులను ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వారికి ప్రాథమిక చికిత్స చేశారు. ఇద్దరి మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని ఎన్నం హాస్పిటల్‌కు తరలించారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు


మెడల్స్ అందుకున్న మహిళలు

మణికొండ: మహిళలు ఖాళీ సమయంలో ఆటలు ఆడి ఆరోగ్యంగా ఉండాలని డెంటల్ కేర్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ఎం. పద్మ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో మహిళలకు వారం రోజులుగా కొనసాగుతున్న శిక్షణ, పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలు జ్యోతి, అనిత, సోమవార, నేహా,సుష్మ, ప్రియాంక, లహరి, హారిక, ప్రీతి, లహరి, రమ్యలకు మెడల్‌లు, కప్‌లను ఆమె అందించారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ ఎం. వేణు, పిక్సా యానిమేషన్ మేకర్స్ శశికాంత్, కిరణ్‌లు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాతలు ఆగం

అకాల వర్షాలు రైతులను ఆగం చేస్తున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన వాన రైతులకు కన్నీటిని మిగిల్చింది. ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. మొక్కజొన్న, జొన్న పంటలు నీటిపాలయ్యాయి. సోమవారం వ్యవసాయాధికారులు రైతులు నష్టపోయిన పంటలను పరిశీలించారు.

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- చేతికొచ్చిన పంటలు నీటి పాలు

కొడంగల్ రూరల్: ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షంతో పంటలు నేలకొరిగాయి. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. మండల పరిధిలోని పాతకొడంగల్ శివారులో వేసిన మొక్కజొన్న పంట నీటిపాలయింది. చేతికొచ్చిన పంట పాడవ్వడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. హస్నాబాద్, ఆలేడ్, పెద్దనందిగామ తదితర గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు నేల రాలాయి.

కూలిన విద్యుత్ స్తంభాలు..

పరిగి: పట్టణం కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. మండల పరిధిలోని రాపోల్, నర్సయ్యగూడ, మాదారం గ్రామాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. మండల వ్యాప్తంగా 20 ఎకరాల మామిడితోటతో పాటుగా మొక్క జొన్న 103, జొన్న 21 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని వ్యవసాయధికారులు వెల్లడించారు. విద్యుత్ స్తంభాలు కూలడంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

కూలిన చెట్లు.. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

కొడంగల్: పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోగా.. నాలుగు ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోయాయి. విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం ట్రాన్స్‌ఫార్మర్స్‌కు మరమ్మతులు చేశారు.


కొడంగల్: గుండ్లకుంట గేటు సమీపంలో కూలిన వృక్షం

పాడైన కంప్యూటర్లు

యాలాల: మండల పరిధిలో ఆదివారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బాగాయిపల్లి–ముద్దాయిపేట మార్గంలో వేప చెట్టు విరిగి రోడ్డుపై పడింది. సోమవారం తెల్లవారుజామున విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. హైఓల్టేజీ కారణంగా తహసీల్దార్ కార్యాలయంలో మూడు కంప్యూటర్లు పాడయ్యాయి. ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు మరమ్మతులకు గురయ్యాయి. సోమవారం సాయంత్రం సైతం అరగంటపాటు వర్షం కురిసింది.


కొడంగల్: సన్‌సిటీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది


కొడంగల్ రూరల్: పాతకొడంగల్‌లో నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు


పరిగి: ఖుదావన్‌పూర్‌లో నేలరాలిన మామిడి


యాలాల: బాగాయిపల్లి-ముద్దాయిపేట మార్గంలో కూలిన చెట్టు

గురు విశ్వస్ఫూర్తి జన్మదిన ఆరాధనోత్సవం

ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు ఆన్‌లైన్ శిక్షణ

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ధ్యాన మనో ప్రస్థానంలో ఆధ్యాత్మిక విశ్వగురువు సైంటిఫిక్ సెయింట్ శ్రీ గురు విశ్వస్ఫూర్తి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు ఉపయోగపడే ఆన్‌లైన్ ఫ్రీ కంప్యూటర్ క్లాసులు ప్రారంభించారు. 1600 మందికి పైగా యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయ మాజీ డైరెక్టర్ ఆచార్య టి. గౌరీశంకర్, ఫార్మర్ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. శంకర్‌రావు, సైన్స్ యూనివర్స్ అధినేత రాజేంద్ర, పీపీసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై కారు బోల్తా

రాజేంద్రనగర్: పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ఓ కారు బోల్తాపడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సోమవారం ఉదయం శంషాబాద్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్న కారు పిల్లర్ నెంబర్ 315 వద్ద బోల్తా కొట్టింది.ఆ సమయంలో కారులో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. బెలూన్‌లు తెరుచుకోవడంతో చిన్నపాటి గాయాలతో ఇరువురు బయటపడ్డారు. ఈ దారి గుండా వెళ్తున్న వారు వీరిని బయటకు తీశారు. దాదాపు ఈ రహదారిపై 45 నిమిషాల పాటు వాహనాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రమాదం విషయమై ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ పోలీసులు వెల్లడించారు.

ఎదురెదురుగా కార్లు ఢీ

మహిళ మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు


లలిత (ఫైల్)

మంచాల: ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందగా.. ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటన ఆగాపల్లి సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై రామన్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా కొండ మల్లేపల్లికి చెందిన నారదాసు లలిత(38) ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో డైరెక్టర్‌గా పనిచేస్తోంది. ఆమె సాగర్ కాంప్లెక్స్‌లో నివసిస్తోంది. సోమవారం లలిత చింతపల్లికి చెందిన తన అక్క కుమారుడు మధుతో కలిసి హైదరాబాద్ వెళ్తోంది. ఆగాపల్లి సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న వేణుగోపాల్ కారును అతివేగంగా నడుపుతూ లలిత ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికీ గాయాలయ్యాయి. లలిత సీట్ బెల్ట్ ధరించకపోవడంతో ఎయిర్ బెలూన్ ఓపెన్ కాకపోవడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు సంతానం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలు సీట్ బెల్టు ధరిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడేవారని ఎస్‌ఐ రామన్‌గౌడ్ అన్నారు. ప్రతీ ఒక్కరు తప్పక సీట్ బెల్టు ధరించాలని ఆయన సూచించారు. రెండు కొత్త కార్లు అవ్వడంతో ఇంకా పర్మినెంట్ నెంబర్ రాలేదు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

20 రోజులు ఉచిత శిక్షణ

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణలలో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు పాఠశాల కమిటీ అధ్యక్షుడు పాపిశెట్టి రాము తెలిపారు. సోమవారం శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. 20 రోజుల పాటు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ధ్యానం, యోగా, వ్యాయామం, సూర్య నమస్కారాలు, శ్లోకాలు, పాటలు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు నారాయణగౌడ్, సత్యనారాయణ, విశ్వనాథం, అంజయ్య, తిరుపతయ్య, భాస్కర్, కవిత, స్వాతి పాల్గొన్నారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి

చేవెళ్ల: ఫిట్స్ రావడంతో ఓ ఫాంహౌస్‌లో పనిచేసే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని ముడిమ్యాల బస్ స్టేజీ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కొత్తూరు మండలం జేపీ దర్గాకు చెందిన శేఖర్(40) మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో పనిచేస్తున్నాడు. పని నిమిత్తం బయటకు వచ్చిన ఆయనకు ఫిట్స్ రావడంతో కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో పోలీసులకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువతి అదృశ్యం

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పహాడీషరీఫ్ ఉమర్ కాలనీకి చెందిన షాహిద్ ఖురేషీ కుమార్తె షాహీదా(19) ఇంటర్ విద్యనభ్యసించింది. ఏప్రిల్ 28న ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంట్లో చెప్పకుండా వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

అదుపు తప్పిన డీసీఎం

- మూడు ఎద్దులు మృతి
- ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు

నందిగామ: పశువుల లోడ్‌తో వెళ్తున్న ఓ డీసీఎం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు పశువుల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం నందిగామ చౌరస్తాలోని యూటర్న్ వద్ద అదుపు తప్పి వ్యతిరేక దిశంలో దూసుకెళ్లింది. రోడ్డుపై ప్రయాణిస్తున్న ఓ బైక్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మూడు ఎద్దులు మృతి చెందగా.. ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి.


ప్రమాదస్థలిలో డీసీఎం

గుర్తు తెలియని వాహనం ఢీ

వ్యక్తికి గాయాలు

చేవెళ్ల: మతిస్థిమితం లేని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని దామరగిద్ద బస్‌స్టేజీ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. దాదాపు 55 ఏళ్ల ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాధితుడు తీవ్రంగా గాయపడి రోడ్డు పక్కన పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి.. క్షతగాత్రుడిని 108 వాహనంలో చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు పరిశీలించగా అతని వద్ద ఎలాంటి సమాచారం లభించలేదు. క్షతగాత్రుడికి మతిస్థిమితం లేకపోవడంతో వివరాలు తెలియలేదు. బాధితుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే చేవెళ్ల పీఎస్‌లో సంప్రదించాలని కోరారు. ప్రస్తుతం ఆయన చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

అంగరంగ వైభవంగా శ్రీనివాస కల్యాణం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రీనివాస కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ పూజారి అనంతాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణ వేడుకల్లో బుద్వేల్‌కు చెందిన సందీప్‌కుమార్, సంతోషి దంపతులు, శ్రీనివాస్, సుచేత దంపతులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. రాజేంద్రనగర్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు.

అత్తింటి వేధింపులపై మహిళ ఫిర్యాదు

కొందుర్గు: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. చౌదరిగూడ గ్రామానికి చెందిన మంజులకు పర్వతాపూర్ గ్రామానికి చెందిన గోపాల్‌తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు. కాగా కొంతకాలంగా దంపతులు గొడవపడుతున్నారు. పెళ్లి సమయంలో కట్నం తీసుకురాలేదని.. ఇప్పుడు తీసుకురావాలంటూ గోపాల్ భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఏప్రిల్ 20న భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులు మంజులపై చేయిచేసుకున్నారు. దీంతో ఆమె సోమవారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భరోసా ఇవ్వని ‘ఉపాధి’

గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న ఉపాధి హామీ కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇటీవల సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపచేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. అదే శాఖలో సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ప్రోగ్రాం అధికారులుగా పనిచేస్తున్న వారిని విస్మరించింది. దీంతో తమపై వివక్ష చూపడం సరికాదని ఉద్యోగులు వాపోతున్నారు.

- 17 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా గుర్తించని ప్రభుత్వం
- సెర్ప్ ఉద్యోగుల తరహాలో పేస్కేల్ ఇవ్వాలి
- ఉపాధి హామీ కాంట్రాక్ట్ ఉద్యోగులు




పరిగి: గ్రామాల అభివృద్ధిలో కీలకంగా మారిన ఉపాధి హామీ ఉద్యోగుల సేవలకు గుర్తింపు లేకుండా పోయింది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 2006లో నియామకమైన ఉపాధి హామీ ఉద్యోగులంతా నేటికీ కాంట్రాక్ట్ పద్ధతిలోనే పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 18మండలాల్లో ఉపాధి ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అందులో ఒక ఏపీడీ, 13 మంది ఏపీఓలు, 13 మంది ఈసీలు, 27 మంది సీఓలు, 99 మంది టీఏలు, పీఓలు, టీఓ ఒక్కొక్కరు చొప్పున జిల్లా వ్యాప్తంగా 159 మంది ఉపాధి ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి సీనియారిటీని బట్టి రూ.18వేల నుంచి రూ.32వేల వరకు వేతనాలు పొందుతున్నారు. సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా తమకు కూడా పేస్కేల్ వర్తింపజేయాలని ఇటీవల జిల్లా ఉపాధి ఉద్యోగుల సంఘాల నాయకులు రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావును కలసి వినతిపత్రం అందించారు.

అవార్డులే పనితీరుకు నిదర్శనం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం, పల్లెప్రగతి, పల్లె ప్రకృతివనం, క్రీడా మైదానం, స్వచ్ఛ భారత్, ఫార్మేషన్ రోడ్లు తదితర పనుల్లో ముందుండి కొలతలు తీసుకుంటూ టెక్నికల్‌గా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉపాధి ఉద్యోగులు అభివృద్ధికి పాటుపడుతున్నారు. వీరి పనితీరుతోనే గ్రామీణాభివృద్ధి శాఖకు అవార్డులు సైతం వచ్చాయి. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు క్షేత్రస్థాయిలో కూలీలను మొబిలైజ్ చేసి వారికి పనులు కల్పించడం, పనులు చేయించడం, మస్టర్‌లు రాయడం జాబ్ కార్డుల్లో పనుల వివరాలు నమోదు చేసుకుని అధికారులకు అందించే పనులు ఫీల్డ్ అసిస్టెంట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 759 గ్రామ పంచాయతీల్లో 700 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు 2006లో గ్రామ సభల ద్వారా నియమితులయ్యారు. ప్రస్తుతం రూ.9,800 వేతనంతో విధులు నిర్వహిస్తున్నారు.

“ ఉద్యోగులుగా గుర్తించడం లేదు



ఉపాధి హామీ పథకం కింద క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నాం. తమకు సరైన వేతనాలు లేక ఏళ్ల నుంచి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదు. సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా పే స్కేల్ వర్తింపజేయాలి.

– నరేశ్, టెక్నికల్ అసిస్టెంట్, కుల్కచర్ల

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



ప్రభుత్వం తమను గుర్తిస్తుందని ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నాం. పెరుగుతున్న ధరలకు వచ్చే వేతనం సరిపోక వ్యయప్రయాసలకు ఓర్చుకుంటున్నాం. ఇప్పటికే తమ ఇబ్బందులను ఎన్నో సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికైనా ప్రభుత్వం తమకూ సెర్ప్ ఉద్యోగుల మాదిరిగానే పేస్కేల్ ఇవ్వాలని ఆర్థికమంత్రికి విన్నవించాం.

– నవీన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, ఉపాధి ఉద్యోగుల జేఏసీ

గతంలో సమ్మె కారణంగా వారిని దూరం పెట్టిన ప్రభుత్వం గత ఏడాది ఆగస్టు నుంచి విధుల్లోకి తీసుకుంది. అయితే పే స్కేల్ అమలు చేస్తే వారికి కూడా ప్రయోజనం చేకూరనుంది.

నియమాలు తప్పనిసరిగా పాటించాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలో నూతన ఆచార్యుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం పాలక మండలి సభ్యుడు డాక్టర్ అన్నదానం సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సంస్కార ప్రక్రియలో మనదైన వ్యవస్థలో నియమాలు పాటించే అలవాటు చేసుకోవాలన్నారు. శిశు మందిరాల నిర్మాణానికి ఆచార్యుడే మూలాధారం అని వివరించారు. సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అధ్యక్షుడు తిరుపతిరావు, సంఘటనా కార్యదర్శి శ్రీనివాస్‌రావు తదితరలు పాల్గొన్నారు.

సీబీఐటీలో ఓటరు నమోదు

మణికొండ: ఓటరు జాబితాలో సవరణలు, కొత్త ఓటరు నమోదును గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల ఎన్నికల అక్షరాస్యత క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 1వ తేదీకి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అక్షరాస్యత క్లబ్ కన్వీనర్ డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్, విద్యార్థి అధ్యక్షుడు భానుప్రసాద్ పాల్గొన్నారు.


ఓటరుగా నమోదు చేసుకుంటున్న విద్యార్థులు